# మంగమ్మగారు మనవరాలి చదువు

స్కూలు నుండి రాగానే పరిగెత్తుకుని వంటింట్లోకి వచ్చిన చిన్నారి "మమ్మమ్మా! అయామ్ హంగ్రీ." అంటూ మంగమ్మగారి దగ్గర చేరింది.



"నీ లంచ్ బాక్స్ ఏదీ? పెట్టి పంపినవి ఏవైనా తిన్నావా? అన్నీ అలాగే వెనక్కి తెచ్చావా?" అంటూ పాప లంచ్ బాక్స్ తెరచి చూశారు. ఏదో

ఒకటి తినక పోతుందా అన్న ఆశతో నాలుగు రకాలు పెట్టి పంపిస్తుంది బుజ్జి. చపాతీ, నూడుల్స్, ద్రాక్ష, కుకీస్ ఇలా వైరైటీ వుండేట్టు చూస్తుంది.

చిన్నారి మాత్రం తిన్న శాస్త్రం చేసి అన్నీ వెనక్కి తెస్తుంది. తను తొందరగా తినలేదు. అందరూ తినేసి ఆటలకుపోతే తనొక్కత్తీ కూర్చుని తినదు.

"సరే దోశ పోసిస్తానుండు" అంటూ స్టవ్ ఆన్‌చేసి వేడెక్కుతున్న హాట్ ప్లేట్ మీద పెనం కాలేసిందావిడ.

"ఐ డోంట్ వాంట్ దోశ" అంది చిన్నారి.

"నీకు జంక్ ఫుడ్ బాగా అలవాటయిదే. చిప్స్, మిక్చర్ అడిగితే మాత్రం ఇవ్వను. మీ అమ్మ వొద్దన్నది." అన్నారు మంగమ్మగారు.

"నో జంక్‌ఫుడ్ మమ్మమ్మా. ఐవాంట్ బుడూ ఉప్మా" అంది పిడుగు పిల్ల.

"నాకు రాదే బుడూ ఉప్మా చేయడం" దాని భాషనే వాడుకుని చెప్పారు. 'బుడూ' అంటే బొరుగులని దాని అర్థం. మమ్మీకి అమ్మ గనుక మమ్మమ్మా అంటుందో 'అమ్మమ్మ' అనడం రాకే అంటుందోగాని ముద్దుగా 'మమ్మమ్మా!' అనే పిలుస్తుంది.

"ఇటీజ్ వెరీ సింపుల్ మమ్మమ్మా. ఐ విల్ టీచ్‌యు. ఒకె?" అంది చిన్నారి పట్టువదలకండా.

"బొరుగులు ఎక్కడ వున్నాయో నాకు తెలియదే" అంటూ తప్పించుకోబోయారు.

"ఐ నో వేర్ ఇటీజ్..." అంటూ క్రింద కబోర్డ్ తెరిచి పెద్ద బొరుగుల ప్యాకెట్ బయటకు తీసింది.

"ఐ విల్ పుట్ బుడూ ఇన్ వాదర్ అండ్ యు కట్ ఆనియన్స్ ఒకె. హెల్ప్ మి సిట్ ఆన్ ది ఐల్." అంటూ అమ్మమ్మను పట్టుకుంది.

సరే అని దాన్నిపైన కూర్చోబెట్టి, గిన్నెలో నీళ్ళు దాని పక్కన పెట్టారు. ఆనందంగా తన చిన్ని దోసిలితో బొరుగులు తీసి నీళ్ళలోపోసి తడపడం మొదలెట్టింది చిన్నారి.

ఇంతలో మంగమ్మగారు ఉల్లిపాయలు, పచ్చిమిర్చి తరిగి, కొత్తిమీర కూడా రెడీ చేసుకుని మూకుడు స్టౌమీద పెట్టి తిరగమోత పెట్టారు.

"మమ్మమ్మా యు ఫర్‌గాట్ టొమాటో..." అంటూ హెచ్చరించింది చిన్నారి.

ఉప్మా రెడీ అయ్యాక స్టౌ ఆఫ్ చేస్తున్న అమ్మమ్మతో "మమ్మమ్మా డిడ్‌యు పుట్ పప్పుల పొడి ఇన్ బుడూ ఉప్మా?" అంటూ మరో ప్రశ్న సంధించింది.

"నీకెన్ని విషయాలు తెలుసే?" అంటూ ఉప్మా మీద పుట్నాల పొడి చల్లిందావిడ.

చిన్నారి పరిగెత్తుకుని వెళ్ళి ఇంకో కబోర్డు నుండి తన 'నీమో' ప్లేటు తెచ్చుకుంది.

మంగమ్మగారు ప్లేటులోకి ఉప్మావేసి స్పూన్ కూడా పెట్టి అందించారు.

"సీ మమ్మమ్మా... ఐ టీచ్ యు బుడు ఉప్మా. ఇటీజ్ వెరి సింపుల్ రైట్?" అంటూ ప్లేటు తీసుకెళ్ళి సెంటర్ టేబులుమీద పెట్టి, 'టామ్ అండ్ జెర్రీ' డి.వి.డి. పెట్టి ఆన్ చేసుకుని వచ్చి టి.వి. చూస్తూ ఉప్మా తినడం మొదలు పెట్టింది చిన్నారి.

దాని స్టైలు చూసి మంగపతిగారు నవ్వుతుంటే "ఇది తాతకు దగ్గులు నేర్పే పిల్ల" అంటూ మురిసిపోయారు మంగమ్మగారు.

"నువ్వు తినేశాక మనం హోమ్‌వర్క్ చేసేద్దాం ఏం? మమ్మీ వచ్చేసరికి నువ్వు హోమ్ వర్క్ ముగిస్తే అమ్మ ఆశ్చర్యపోతుంది. సరేనా?". అంటున్న మంగమ్మగారి మాటలకు టి.వి. మీద నుండి కళ్ళు తప్పకుండానే బుద్ధిగా తల ఊపింది.

'టామ్ అండ్ జెర్రీ' పూర్తి అయ్యేదాకా చిన్నారి తినడం పూర్తి కాలేదు. తరువాత వెళ్ళి తన పుస్తకాలు తెచ్చింది.

"ముందు రీడింగ్ ప్రాక్టీసు చెయ్యి. ఏదీ చదువు మరి సి ఎటి క్యాట్, బి.ఎ.టి. బ్యాట్ అంటూ మొదలు పెట్టారు మంగమ్మగారు.

"నో నో మమ్మమ్మా... నాట్ లైక్ దట్... సీ! క అ ట్ క్యాట్, బ అట్ బ్యాట్ డ ఒగ్ డాగ్..." అంటూ చదివి చూపించింది.

"స్పెల్లింగు చెప్పి చదివించడం మీ కాలంలో వీళ్ళకి 'ఫోనిక్స్' అంటే శబ్దాలు పలకడం, అలా కూడుకుని పదం పలకడం నేర్పిస్తారు." నవ్వుతూ చెప్పారు మంగపతిగారు.

'నీ హోమ్ వర్క్ ఏదో మీ తాతయ్య నడిగి నేర్చుకోవే... నాకు పనుంది." అంటూ చల్లగా జారుకున్నారు మంగమ్మగారు. బుద్ధిగా తాతగారి దగ్గరకు వెళ్ళి కూర్చుని కాసేపు రీడింగ్ ప్రాక్టీసుచేసి తర్వాత రైటింగ్ మొదలు పెట్టింది.

కూతురు ఇంటికి వచ్చేవేళ అయిందని వంట మొదలు పెడుతున్నారు మంగమ్మగారు. క్రింద గూట్లో వున్న బియ్యం డబ్బాలో నుండి బియ్యం కుక్కర్‌లోకి కొలిచి వేస్తుంటే రాయడం ఆపేసి పరిగెత్తుకొచ్చింది చిన్నారి.

"మమ్మమ్మా! వై ఆర్ యు బెండింగ్ లైక్ దట్... యు సెడ్ యువర్ బ్యాక్ హర్ట్స్... యు షుడ్‌నాట్ బెండ్..." నడుముమీద చేతులు పెట్టుకుని పెద్దదానిలా అన్నది చిన్నారి. దాని అభిమానానికి సంతోషం కలిగిందావిడకు.

"అయామ్ ఫీలింగ్ మచ్ బెటర్ చిన్నా..." అన్నారు పాప తల నిమురుతూ!

"మచ్ బెటర్? వి డోంట్ సే దట్ ఇన్ కాలిఫోర్నియా..." అర్థం కానట్టుగా చూసి అంది.

అయోమయంగా మంగపతిగారి వైపు చూశారు మంగమ్మగారు.

'ఆ 'మచ్ బెటర్' అన్నది ఇక్కడ వాడరేమో" అన్నారాయన మనవరాలివైపు ముచ్చటగా చూస్తూ.

మళ్ళీ తన చిన్న కుర్చీలో కూర్చుని రాసుకోవడం మొదలెట్టింది చిన్నారి.

అయిదు నిముషాలైనా కాకముందే మళ్ళీలేచి పరిగెత్తుకు వచ్చింది. "ఆర్ యు మేకింగ్ చింతకాయ పచ్చడీ మమ్మమ్మా? ఐ లైకిట్..." అంటూ రాత్రి భోజనంలోకి తనకేం కావాలో చెప్పి మళ్ళీ వెళ్ళింది.

ఇంతలో బుజ్జి, ఆమె భర్త ఆఫీసునుండి రావడంతో చదువు కట్టి పెట్టి అమ్మా నాన్నల దగ్గరికి పరుగుతీసింది చిన్నారి.

పాపను ఎత్తుకుని లోపలికి వస్తూ "అమ్మమ్మ ఏం టిఫిన్ చేసి పెట్టిందిరా నీకు? తిన్నావాలేదా?" అనడుగుతూ వంటింట్లోకి వచ్చింది బుజ్జి.

"మమ్మమ్మా గేవ్ మి బుడు ఉప్మా... ఐ టీచ్ హర్ హౌ టు మేక్ బుడు ఉప్మా. రైట్ మమ్మమ్మా?" చాలా ఉత్సాహంగా చెప్పింది చిన్నారి.

"మమ్మమ్మా క్యాంట్ రీడ్... సో ఐ టీచ్ హర్ రీడింగ్ టూ..." అంది గొప్పగా.

"అలా అనకూడదురా.. సరే అమ్మమ్మకు బోలెడు కథలు వచ్చు. రాత్రి మంచి కథ చెప్తుందిలే... ఒకె?" అని దాన్ని దింపేసి "ఏం అమ్మా! దీని మాటలతో మీకు మంచి కాలక్షేపం కదూ?" అంది బుజ్జి తల్లితో.

"కాలక్షేపం బ్రహ్మాండంగా జరుగుతుందిగానీ నీ కూతుర్ని మాటల్లో జయించలేం" అన్నారు మంగమ్మగారు నవ్వుతూ.

రాత్రి చింతకాయ పచ్చడి అన్నం రెండుసార్లు అడిగి పెట్టించుకుంది చిన్నారి తన 'నీమో' ప్లేటులోకి. 'నీమో' అన్న చేప గురించిన సినిమా వచ్చాక పిల్లల వస్తువులన్నిటిమీద 'నీమో' బొమ్మలు వెలిశాయి.

"స్కూల్‌కి లంచ్ బాక్స్‌లోకి అన్నం ఒద్దు అంటుంది. పాస్తా, నూడుల్స్ లాటివి కావాలి. ఇంట్లో మాత్రం పప్పులపొడి, చింతకాయ పచ్చడి తింటానంటుంది. దీని వేషాలు చూడమ్మా..." అంది బుజ్జి.

"స్కూల్లో ఎవరూ పప్పు అన్నం తెచ్చుకోరు కదా... అందుకని దానికి ఇష్టం వుండదేమో... వాళ్ళందరితో కలిసిపోవాలని వుంటుంది కదా తనకు..." బుజ్జి భర్త కూతుర్ని సమర్థించాడు.

అన్నం తిన్నాక రోజూలాగా కథకోసం అమ్మ వెంట బడకుండా అమ్మమ్మ గదిలోకి వచ్చి పక్కన చేరింది చిన్నారి.

"విల్ యు రీడ్ మి స్నోవైట్ స్టోరీ మమ్మమ్మా?" అంటూ తను తెచ్చిన పుస్తకం తెరిచింది. దానికి ఆ పుస్తకం చదవడం రాకపోయినా ఏ పేజీలో ఏముందో కంఠస్థంగా తెలుసు. మంగమ్మగారు ఎక్కడైనా ఒక పదం దగ్గర తడబడితే టక్కున ఆ పదం చెప్పేస్తుంది. అయినా అవే కథలు రోజూ రాత్రి తను పడుకునే ముందు వాళ్ళమ్మ చదివి వినిపించాలి.

"రోజూ స్లీపింగ్ బ్యూటీ, సిండ్రెల్లా, స్నోవైట్ కథలేనా? ఇవాళ ఆ చదవడం నావల్లకాదుగానీ నీకు కృష్ణుడి కథ కావాలా? హనుమంతుడి కథ కావాలా?" అని అడిగారు మంగమ్మగారు.

"ఐ లైక్ హనుమాన్ బికాజ్ హి ఈజ్ వెరీ వెరీ స్ట్రాంగ్." అంది గంపంత ముఖం చేసుకుని లేచి కూర్చుంటూ.

మంగమ్మగారు హనుమంతుడి కథ మొదలు పెట్టారు. హనుమంతుడు సూర్యుడిని పట్టుకుని తినడానికి ప్రయత్నించే ఘట్టం దగ్గరికి వచ్చేసరికి నోటికి చిన్న చేతులు అడ్డం పెట్టుకుని ముసి ముసిగా నవ్వడం మొదలు పెట్టింది చిన్నారి.

"ఎందుకే అంత నవ్వు" మనవరాలి బుగ్గ పుణికి అడిగారు మంగమ్మగారు.

"హనుమాన్ థింక్స్ ది సన్ ఈజ్ ఎ ఫ్రూట్ మమ్మమ్మా... దటీజ్ వై హి ట్రైస్ ఈట్ హిమ్." అంది నవ్వు ఆపుకుంటూ.

"ఓసి భడవా నీకిదికూడా తెలుసునా? సరే అయితే హనుమంతుడి అమ్మ పేరు నేను చెప్పలేదు కదా! నువ్వు చెప్పుమరి..." అనడిగిందావిడ.

"అంజనీదేవి అమ్మమ్మా... యు డోంట్ నో దట్?" అనడిగింది పాప.

"తెలుసులేవే తల్లీ..." అంది అమ్మమ్మ.

"నౌ ఐ విల్ అస్క్ యు ఎ కొశ్చెన్... వాటీజ్‌ది నేమ్ ఆఫ్ ది డీమన్ హూ స్వాలోస్ హనుమాన్ వెన్ హి ట్రైస్ టు క్రాస్ ది ఓషన్?" చాలా సీరియస్‌గా అమ్మమ్మను పరీక్షించింది చిన్నారి.

మంగమ్మగారికి ఆ రాక్షసి పేరు గుర్తుకు రాలేదు... 'శరణు' అన్నట్టు మంగపతిగారివైపు చూసిందావిడ.

"తాతా డు యు నో?" అనడిగింది ఇటు తిరిగి. "ఆ డీమన్ పేరు సురస అని అమ్మమ్మకు తెలుసునురా..." అన్నారాయన లౌక్యంగా.

"ఒకె నౌ టెల్ మి క్రిష్టాస్ స్టోరీ అమ్మమ్మా....! అంటూ టాపిక్ మార్చింది చిన్నారి.

"నీకు హనుమాన్ అంటే ఎక్కువ ఇష్టమన్నావుగా?" మంగమ్మగారు గుర్తుచేశారు.

"యా! బట్ ఐ లైక్ క్రిష్టా టూ.. హి ఈజ్ ఆల్సో వెరీస్ట్రాంగ్" అంది.

"అమ్మా నువ్వలా కథలు చెప్తూ వుంటే అది పన్నెండు వరకైనా మేలుకుంటుంది... నువ్వు పద చిన్నారీ పడుకుందువు..." అంటూ బుజ్జి వచ్చి అడ్డు తగిలింది.

"నో మమ్మీ... ఓన్లీ వన్‌మోర్ స్టోరీ. ఒకె?"

"మమ్మమ్మా టెల్ మి హౌ క్రిష్టా ఫైట్స్ విత్ దట్ ఎలిఫెంట్..." అంటూ అమ్మమ్మకేసి తిరిగింది.

"పూతన కథ, శకటాసురుడి కథ అన్నీ దాటి వచ్చేశావుటే? సరే విను కంసుడు కృష్ణుడిని చంపేయాలని ఒక ఏనుగును పంపించాడు. అది ఎంత పెద్ద ఏనుగు అంటే..." అని ఆవిడ వర్ణించబోతుండగా మళ్ళీ అడ్డు తగిలింది చిన్నారి.

"యు డిడిన్ట్ టెల్ మి ది నేమ్ ఆఫ్ దట్ ఎలిఫెంట్..." అంటూ.

'దానిపేరు... ఆ ఏనుగు పేరేమిటంటే..." అంటూ మంగమ్మగారు భర్తవైపు చూశారు.

"ఎగైన్ యు డోంట్ నో... 'కువలయా పీడనమ్ ఈజ్ ది నేమ్ మమ్మమ్మా..." అని అందించింది చిన్నారి.

ఇంతట్లో మంగపతిగారు లేచి లైట్ ఆఫ్ చేసి "ఇంతకీ నువ్వు దానికి నేర్పుతున్నావా? అది నీకు నేర్పిస్తోందా అర్థం కావడం లేదు..." నవ్వేస్తూ అని పడుకున్నారు.

"అయ్యో లైటు తీసేసి చీకటిగా వుంటే భయపడుతుందేమోనండీ.." అన్నారు మంగమ్మగారు.

"డోంట్ ఫియర్ మమ్మమ్మా! ఆయామ్ హియర్..." అంటూ అమ్మమ్మ మెడచుట్టూ చేతులు వేసి కౌగలించుకుని పడుకుంది చిన్నారి.

అంతలో ఏదో గుర్తొచ్చినట్టు లేచి "ఒన్ సెకెండ్ మమ్మమ్మా.. ఐ విల్ కమ్ బ్యాక్ ఒకె. డోంట్ ఫియర్." అంటూ పరిగెత్తుకు వెళ్ళి తన 'డోరా" బొమ్మను తెచ్చుకుని పక్కన పెట్టుకుని పడుకుంది చిన్నారి.

"డోరా నోట్ బుక్, డోరా ఫ్రాక్, డోరా పాటీ... అన్నీ డోరా, యేనా," చిన్నారి తల నిమురుతూ అన్నదావిడ.

'ఐ లైక్ 'డోరా' టూ!" అంటూ నిద్రపోయింది పాప.